సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 2 । జూలై । 2023



రూ.826 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం

కడప నగరపాలక సంస్థలో రూ.826 కోట్లతో రూపొందించిన 9 ప్రాజెక్టులకు సర్వ సభ్య సమావేశం ఆమోదం తెలిపింది. -8లో..



నడిరోడ్డుపై కత్తులతో యువకుల ఘర్షణ

కడప నగరం పాలెంపాపయ్య వీధిలో శనివారం రాత్రి నడిరోడ్డుపై యువకులు కత్తులతో ఘర్షణకు దిగారు. -8లో..



విద్యాబోధనపై అవగాహన లేకపోతే ఎలా?

విద్యాబోధనపై టీచర్లకు అవగాహన లేకపోతే ఎలా అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. -8లో..

న్యూస్‌రీల్

నేడు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులకు ఆదివారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. సీనియారిటీ జాబితాను సంబంధిత జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

నేడు రైతు బజార్‌కు సబ్సిడీ టమోటాలు

కడప అగ్రికల్చర్: కడప రైతు బజార్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ టమోటాలు ఆదివారం వస్తాయని మేనేజర్ నాయక్ తెలిపారు. వినియోగదారులు తమ ఆధార్ కార్డు తీసుకుని వచ్చి టమోటాలను తీసుకెళ్లాలని తెలిపారు. ఒక్కొక్కరికి ఒక కేజీ మాత్రమే ఇస్తామన్నారు.

నూతన నియామకం



తుపాకుల రాఘవేంద్ర

సింహాద్రిపురం : కాపునాడు జాతీయ కార్యదర్శిగా సింహాద్రిపురం మండల బలిజ సంఘ అధ్యక్షుడు తుపాకుల రాఘవేంద్ర నియమితులయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పదవి రావడానికి కృషి చేసిన కాపునాడు నాయకులు సోపాల వీరా, రాము, కావలి కృష్ణతేజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాపునాడు సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

బాధ్యతల స్వీకరణ



పూర్వపు ఎస్‌ఓ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారిగా కనం జగన్నాథ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన బాషామోహిద్దీన్ జూన్ 30వ తేదీతో ఉద్యోగ విరమణ చేశారు. క్రీడాపాఠశాల శిక్షకులు, ఉపాధ్యాయులు నూతన ప్రత్యేకాధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

'డీసీసీబీలను సహకార బ్యాంకుల్లో విలీనం చేయాలి'

కడప అగ్రికల్చర్: రాష్ట్రంలోని డీసీసీ బ్యాంకులను రాష్ట్ర సహకారం బ్యాంకుల్లో విలీనం చేయాలని ఏపీ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు గంటా నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అన్ని వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు, సహకార బ్యాంకు ఉద్యోగులు తమ డిమాండ్లను తెలియచేస్తూ బ్యాడ్జిలను ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం బ్యాంకు సమయం ముగిసిన తర్వాత బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట వాణిజ్య బ్యాంకు ఉద్యోగులు, సహకార బ్యాంకు ఉద్యోగులు నినదిస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా గంటా నారాయణరెడ్డి మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకు ఉద్యోగుల వలే సహకార బ్యాంకు ఉద్యోగులకు కూడా పెన్షన్ సదుపాయాలన్నీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు, సహకార బ్యాంకు ఉద్యోగులతోపాటు బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

రాజీ మార్గం.. రాజమార్గం

- లోక్ అదాలత్, పర్మినెంట్ లోక్ అదాలత్‌ల ద్వారా కేసులకు శాశ్వత పరిష్కారం
- ప్రతి ఏడాదిలో నాలుగు నుంచి ఐదు జాతీయలోక్ అదాలత్‌ల నిర్వహణ
- జిల్లాలో విస్తృతంగా ప్రచారం జరగడంతో అనూహ్యంగా కేసులకు పరిష్కారం

కడప అర్బన్: సమాజంలో న్యాయస్థానాలకు ప్రత్యేక గౌరవస్థానం, అన్ని శాఖలను గాడిలో పెట్టగలిగిన క్రమశిక్షణా చర్యల అధికారాలు విస్తృతంగా వుంటాయి. ఎంతో కాలంగా పెండింగ్‌లో వున్న కేసులను కేవలం రాజీ మార్గంలోనే లోక్ అదాలత్, పర్మినెంట్ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకుని తగిన నష్టపరిహారంను పొందగలుగుతున్నారు. 1987, నవంబర్ 9న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేయగా.. 1995 నవంబర్ 9న అమలులోకి వచ్చింది. క్రమంగా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలకు విస్తరించింది.

- జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వారు నిర్దేశించిన తేదీలలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ)ను న్యాయసేవాసదన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సంస్థకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్‌గాను, సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్‌గా, సీనియర్ అడిషనల్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్ డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌ఛార్జ్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.
- ప్రతి శనివారం జిల్లాకోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ కాదగిన కేసులను ఇరువైపులా న్యాయవాదులు, తమ కక్షిదారుల సమక్షంలో రాజీ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు.
- జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించే సమయంలో ఇంకా విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో పాటు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్‌లు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగుల విశేష కృషితో భారీ స్థాయిలో కేసుల పరిష్కారం లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటిని పరిష్కరించేందుకు అహర్నిశలు శ్రమిస్తారు.
- సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీ కాదగిన వాటిని ఈ కార్యక్రమాల్లో ఇరువైపుల వారు రాజీ అయ్యేందుకు సువర్ణఅవకాశం వుంటుంది. చిన్నచిన్న ఘర్షణలు, ప్రమాదాల కేసులు, ఆస్తి తగాదాలు, ఇతర అంశాల పరిధిలో నిబంధనల మేరకు ఈ రాజీ ప్రయత్నాలు కొనసాగుతాయి. బెంచీలలో నేరుగా న్యాయమూర్తులు పాల్గొని ఆయా కేసుల రాజీలు చేస్తుంటారు.
- **లోక్ అదాలత్‌లో సమాచారం కోసం:** 08562 258622, 244622, ఈ మెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్.ఈకోర్ట్స్.జీఓవి.ఐఎన్/కడప, డీఎల్‌ఎస్‌ఏకేడీపీ అట్‌ది డేటా ఫ్ జీ మెయిల్ డాట్ కామ్‌లలో సంప్రదించవచ్చును.



కడప లోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయసేవాసదన్‌లో వున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ (ఇన్‌సెట్) అవగాహన సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తులు (ఫైల్)

పర్మినెంట్ లోక్ అదాలత్...

కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో వున్న ఈ శాశ్వత లోక్ అదాలత్‌కు ప్రస్తుతం రిటైర్డ్ న్యాయమూర్తి స్వర్ణ ప్రసాద్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఇచ్చే తీర్పులు సుప్రీం కోర్టు తీర్పులతో సమానంగా వుంటాయి.

- ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం (ఏ ఇతర కోర్టులో పెండింగ్‌లేని) కలిగి వున్న వారందరికీ ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడిన వ్యవస్థ 'పర్మినెంట్ లోక్ అదాలత్'. ఇది రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడింది. ఇందులోని తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదు.
- ఈ వ్యవస్థ ద్వారా 10 ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో లోపాల వలన కలుగు నష్టాలను విన్నవించి, సంబంధించిన న్యాయం త్వరగా పొందవచ్చును.
- రవాణా సేవలు: రోడ్డు, రైల్వే, విమాన సేవలకు సంబంధించి ప్రయాణీకులు తరలింపు, సరుకుల రవాణా సేవలు.
- పోస్టల్, టెలిగ్రామ్, టెలీఫోన్ సేవలు.
- విద్యుత్, నీటి సరఫరా సేవలు: ఏదేని సంస్థ ద్వారా అందించే సేవలు.
- మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీల సేవలకు సంబంధించి: మురుగు నీటి కాల్వల నిర్వహణ, ప్రజా సౌకర్యం లాంటి సేవలు
- ప్రజా ఆరోగ్యం, వైద్య చికిత్సా కేంద్రాలు: ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్ సేవలు.
- బీమా సౌకర్యం: జీవిత బీమా, సాధారణ బీమాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో జీవిత బీమా, వాహన, పంటల, గృహ బీమా మొదలగు సేవలు.
- బ్యాంకింగ్, ఇతర ఆర్థిక సంస్థల సేవలు.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సేవలు.
- విద్య, విద్యాసంస్థలు: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల సేవలు.
- స్థిరాస్తి వ్యాపారం (రియల్ ఎస్టేట్): ప్లాట్స్ మరియు గృహ నిర్మాణ సేవలు.

➡ పైన తెలుపబడిన రంగాలకు సంబంధించి ఎలాంటి సేవలలో లోపంగానీ, నష్టంగానీ, అన్యాయం గానీ జరిగితే తక్షణమే 'పర్మినెంట్ లోక్ అదాలత్, కడప' వారికి వినతిపత్రంతో పాటు, తగిన ఆధారాలతో సమర్పించాలి. ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా అతి తక్కువ సమయంలో న్యాయం అందజేస్తారు. పూర్తి వివరాలకు కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో వున్న పర్మినెంట్ లోక్ అదాలత్ కార్యాలయం వారిని సంప్రదించాలి. సందేహాలకు 86396 84279, 99637 31698 నంబర్లలో సంప్రదించాలి.



కక్షిదారులకు నష్టపరిహారం చెక్కును అందిస్తున్న న్యాయమూర్తులు (ఫైల్)

జిల్లాలో గత ఏడాది నుంచి నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాల్లో పరిష్కరించిన కేసులు, వాటి ద్వారా కక్షిదారులు లబ్ధి పొందిన నష్టపరిహారంల వివరాలిలా వున్నాయి.

తేదీ	బెంచీలు	పరిష్కారమైన కేసులు	నష్టపరిహారం
12-03-2022	28	6022	రూ.4,56,38,291
26-06-2022	27	12,501	రూ.26,93,27,226
13-08 - 2022	27	10,262	రూ.76,75,200
12-11 -2022	27	11,262	రూ.1,83,67,512
11-02-2023	25	12,348	రూ.7,79,15,299
18-03-2023	19	24 కేసులు	రూ.54,30,000
13-05 -2023	22	12,897	రూ.18,97,76,833

పర్మినెంట్ లోక్ అదాలత్‌ను ఆశ్రయించండి



సమాజంలో ప్రజలు అందుకుంటున్న 10 రకాల సేవల్లో ఏదైనా లోపం కనిపిస్తే పరహారం కోసం దావా వేయండి. నష్ట పరిహారం చెల్లింపునకు మా వంతుగా సహకరిస్తాం. ప్రజా ప్రయోజిత సేవలలో లోపాలతో ప్రజలు నష్టపోకూడదు. ఈ వ్యవస్థలో ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చు.

– స్వర్ణ ప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్, కడప

టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో సిగపట్లు!

- పబ్బాపురం లేఅవుట్‌పై టీచర్స్ గరం గరం
- శోత్రియందారుల హక్కు కంటే అధికంగా ఎన్‌ఓసీ జారీ
- తీర్మానం తేదీ కంటే ముందస్తు ఏడాదిలో రైత్వారీ పట్టా
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం
- తహసీల్దార్ కార్యాలయంలో లభించని రికార్డులు
- నేడు వాడీ వేడిగా కొనసాగనున్న సమావేశం

సాక్షి ప్రతినిధి, కడప: టీచర్స్ హక్కులను హౌస్ బిల్డింగ్ సొసైటీ కాలరాసింది. తీర్మాణాలకు విరుద్ధంగా ఎన్‌ఓసీ కట్టబెట్టింది. దశాబ్దాల తరబడి హక్కుదారుకు స్థలాలు కేటాయించకుండా పాడి ఆవు లెక్కన పబ్బాపురం లేఅవుట్‌లో పిండుకుంటున్నారని ఓ వర్గం వాదన.

కాదు, కాదు టీచర్స్‌కు సకాలంలో స్థలాలు కేటాయించాలనే తాపత్రయమే ఎన్‌ఓసీ ఇవ్వడానికి ఏకైక కారణం. ఇందులో ఎలాంటి మతలబు లేదని మరోవర్గం వాదిస్తోంది. వెరసి టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పాలకవర్గంలో సిగపట్లు ప్రస్ఫుటమవుతున్నాయి. రికార్డులు లేకపోయినా అక్రమ రిజిస్ట్రేషన్‌కు తెరలేపారని క్రిమినల్ కేసు నమోదు చేయాలని పట్టుబడుతున్న నేపథ్యమిది.

– కడప రూరల్ పబ్బాపురం గ్రామ పరిధిలో 1430 మంది టీచర్లకు ఇంటి స్థలాల కోసం టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ 88 ఎకరాలు 1989లో కొనుగోలు చేశారు. అప్పట్లో ఆ భూమి వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు, కాలక్రమేపీ రింగ్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. 2006లో మా సమ్మతి లేకుండా కొనుగోలు చేశారని శోత్రియందారులు కోర్టును ఆశ్రయించారు. పదేళ్ల తర్వాత తీర్పు రాగా, టీచర్స్ అప్పీల్‌కు వెళ్లిన పిదప 1/3 వంతు శోత్రియం హక్కుదారులకు ఇవ్వాలని ఉత్తర్వులున్నాయి. కేవలం 20 ఎకరాలకు మాత్రమే శోత్రియందారుల ప్రమేయం లేకుండా కొనగోలు చేశారని, అందులో 1/3 వంతు ఇవ్వాల్సి ఉంటుందని టీచర్లు వివరిస్తున్నారు. ఈలెక్కన దాదాపు 6.66 ఎకరాలు మాత్రమే అప్పజెప్పాల్సి ఉంటుంది. తదుపరి ఎలాంటి ఆటంకాలు అటు రైతులు, ఇటు శోత్రియందారుల నుంచి తలెత్తకుండా 12.5 ఎకరాలు అప్పగించి, తక్కిన భూమిని మాత్రమే హౌస్‌బిల్డింగ్ సొసైటీకి కేటాయించుకోవాలని పాలకవర్గం 2022లో తీర్మాణం చేసింది. కాగా, 20 ఎకరాలు శోత్రియందారులు సూచించిన శుభకీర్తి డెవెలపర్స్ పేరిట అంతకు ముందే 2021లో రిజిస్టర్ చేయడాన్ని టీచర్స్ మండిపడుతున్నారు.

▶▶ రికార్డులేకున్నా రిజిస్ట్రేషన్...

పబ్బాపురం టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పరిధిలో 20 ఎకరాలకు రైత్వారీ పట్టా ఒకటికి వెలుగులోకి తెచ్చారు. ఆ రైత్వారీ పట్టాకు చెందిన భూమి వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో లేదు. అయినప్పటికీ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శుభకీర్తి డెవెలపర్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈమొత్తం వ్యవహారాన్ని కొంతమంది ఉపాధ్యాయులు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి గత బుధవారం తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఆయన జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు ఫోన్ చేసి వాస్తవాలేమిటో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఆమేరకు జాయింట్ కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్, చింతకొమ్మదిన్నె తహశీల్దార్, టీచర్లతో కలిపి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఆపై టీచర్స్ తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తే 2021లో రైత్వారీ పట్టా కేటాయింపునకు చెందిన ఎలాంటి రికార్డులు అందుబాటులో లేవని స్పష్టమైంది. నకిలీ రైత్వారీ పట్టాతో 20 ఎకరాలు వెబ్‌ల్యాండ్‌లో లేకపోయినా శుభకీర్తి డెవెలపర్స్‌కు రిజిస్ట్రేషన్ అయ్యింది. కాగా శుభకీర్తి డెవెలపర్స్ మైదుకూరు టీడీపీ నేతకు చెందిన సూట్‌కేస్ కంపెనీగా గుర్తించారు. ఈ నేపధ్యంలో ఆదివారం టీచర్స్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ పాలకవర్గం కడప సీఎస్ఐ స్కూల్‌లో సమావేశం కానుంది. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై కేసు నమోదు చేసి, బాధ్యులపై చర్యలకు డిమాండ్ చేస్తుండడం విశేషం.

పింఛన్ పరవశం

- జిల్లాలో 2,52,289 పింఛన్‌లు
- మొత్తం రూ 66.67 కోట్లకు పైగా అందజేత
- వలంటీర్ల ద్వారా పంపిణీకి చర్యలు

కడప రూరల్: ఒకటో తేదీ వచ్చింది.. ఇంటి గుమ్మం వద్దకే పింఛన్ వచ్చి పలకరించిందని పండుటాకులు పరవశించి పోతున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద వలంటీర్ల ద్వారా పింఛన్‌లకు సంబంధించిన నగదు పంపిణీ ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. మొత్తం 2,52,289 పింఛన్‌లకు గాను మొత్తం రూ. 66,61,00,600 నగదును అందజేయాలి. వలంటీర్లు వేకువ జాము నుంచే పింఛన్‌ల పంపిణీ ప్రక్రియను చేపట్టారు.

ఠంఛన్‌గా పింఛన్ వస్తోంది....



ఈమె పేరు కదీరున్నీసా కడప నగరం, రవీంద్రనగర్‌లో నివసిస్తోంది. ప్రొద్దున్నే ఆ ఏరియా వలంటీర్ హసీనా వెళ్లి కదీరున్నీసాకు వితంతువు పింఛన్‌ను అందజేసింది. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటవ తేదీనే పింఛన్ వస్తోంది. ఈ డబ్బు నా కెంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పింది.

ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



వీల్ చైర్‌లో ఉన్న ఈ వ్యక్తి పేరు షేక్ కరీం. కడప నగరం, పాత బస్టాండ్ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ సునీల్ వెళ్లి షేక్ కరీంకు దివ్యాంగుల పింఛన్‌ను ఇచ్చారు. పింఛన్ నగదును అందుకున్న కరీం ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందని అన్నారు.

జగనయ్యకు అల్లా దీవెనలు ఉంటాయి..



ఈ వృద్ధుని పేరు పఠాన్ జబ్బార్‌ఖాన్. కడప నగరం రవీంద్రనగర్ వాసి. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ రూతు వచ్చి జబ్బార్‌ఖాన్‌ను పలకరించింది. పింఛన్ నగదును అందజేసింది. జబ్బార్‌ఖాన్ చిరునవ్వుతో వలంటీర్ ఇచ్చిన నగదును అందుకున్నారు. ముఖ్యమంత్రి జగనయ్య మా లాంటి వారికి ఎంతో మేలు చేస్తున్నారు. ఆయన చేసే మేలును మేమెన్నటికీ మరువం. మా జగనయ్యకు అల్లా దీవెనలు ఉంటాయని సంతోషంగా అన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: కలెక్టర్

బద్వేలు అర్బన్ : అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ వి.విజయరామరాజు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లె సచివాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపును ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలో ప్రజల దరఖాస్తులపై ఆరా తీశారు. ప్రజలతో మాట్లాడి ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించిన అర్హులకు ఆగస్టు 1వ తేదీ నుండి పథకాలు అందుతాయని తెలిపారు.

క్రమబద్ధీకరణ సద్వినియోగం చేసుకోండి..

బద్వేలు మున్సిపాలిటీలో మాత్రమే జరుగుతున్న ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణ అవకాశాన్ని ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ప్రజల వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిక్రిష్ణ పాల్గొన్నారు.

11 రకాల సేవలు

గోపవరం : అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అందాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శనివారం గోపవరం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమ గ్రామసభలో కలెక్టర్ మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాలైన సేవలు ఉచితంగా అందజేస్తామన్నారు. అనంతరం గోపవరం సచివాలయం పరిధిలో 266 మందికి ఉచితంగా వివిధ రకాల ధృవీకరణపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఏపీపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ వెంకటలక్షుమ్మ, ఎంపీటీసీ సరస్వతమ్మ పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్ : జగనన్న సురక్ష కార్యక్రమంపై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు

రూ.826కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.36.19కోట్లు జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు తీర్మానం
- రూ.33కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు జమ చేసేందుకు అంగీకారం
- కడప నగరపాలక అత్యవసర సమావేశంలో కీలక నిర్ణయాలు



నగరపాలక అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో అమృత్ 2.0 కింద తాగునీరు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణకు రూ.826కోట్లతో రూపొందించిన 9 ప్రాజెక్టులకు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. శనివారం సాయంత్రం మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశానికి డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం కార్పొరేటర్లు హాజరయ్యారు. అమృత్ ఫండింగ్ పాటర్న్ నిబంధనలకు లోబడి అడ్మిజబుల్, ఇన్ అడ్మిజబుల్ కాస్ట్, నిర్వహణ ఖర్చులను కార్పొరేషన్ భరించేలా తీర్మానం చేశారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా కోసం రూ.462కోట్లతో, కడప సీవేజ్, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ కోసం రూ. 50.22కోట్లతో, ఏపీ టిడ్కోకు తాగునీరు అందించేందుకు రూ.5.17కోట్లతో, ఏపీ టిడ్కో చిన్నచౌకు, చలమారెడ్డి పల్లె లే ఔట్లకు నీరందించేందుకు రూ.8.04కోట్లతో రూపొందించిన ప్రాజెక్టులను ఆమోదించారు. ఇందులో మొత్తం రూ.26.64కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.33.12కోట్లు కడప కార్పొరేషన్ భరించేలా తీర్మానించారు. మిగిలిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి.

■ అలాగే పేదలు నివసిస్తున్న హౌసింగ్ కాలనీలకు తాగునీరందించేందుకు రూ.37.23కోట్లతో, కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీరందించేందుకు రూ.110.76కోట్లతో, పేదల కాలనీల్లో సీవేజ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేందుకు రూ.69.21కోట్లతో, దేవునికడప చెరువు అభివృద్ధికి రూ.68.45కోట్లతో, పుట్లంపల్లె చెరువును అభివృద్ధి పరిచేందుకు రూ. 15కోట్లతో రూపొందించిన డీపీఆర్‌లను ఆమోదించారు. ఇందులో రూ.9.55కోట్లు కార్పొరేషన్ భరించాల్సి ఉంటుంది. మిగిలిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి.

■ వీధుల్లో ఏర్పాటు చేస్తున్న నేమ్ బోర్డుల్లో ఉర్దూ భాషలో కూడా పేర్లు రాయాలని కార్పొరేటర్ షఫీ కోరారు.

ఎన్నికల్లోపు పాత మున్సిపాలిటీకి నీరందించాలి– డిప్యూటీ సీఎం

కార్పొరేటర్ మగ్బూల్‌బాషా మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులు అమల్లోకి వచ్చేసరికి పుణ్యకాలం పూర్తవుతుందని, ఆలోపు రామనపల్లె స్కీంను పూర్తి చేసి పాత మున్సిపాలిటీ ఏరియా, సాయిపేట ప్రాంతాలకు తాగునీరందించాలని కోరారు. దీనికి కమిషనర్ ప్రవీణ్‌చంద్ సమాధానమిస్తూ రామనపల్లె స్కీంను ఇందులో పొందుపరిచినప్పటికీ పై స్థాయిలో తిరస్కరించారని తెలిపారు. ఈ దశలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా జోక్యం చేసుకుంటూ రామనపల్లె సోర్స్‌ను వినియోగించుకునేందుకు అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు. డిస్ట్రిబ్యూషన్ లైన్ వేస్తారా, మరొకటి చేస్తారా... తెలియదుగానీ ఏదో ఒకటి చేసి పాత మున్సిపాలిటీ, సాయిపేట ఏరియాలకు ఎన్నికల్లోపు నీరివ్వాలన్నారు.

కడప కార్పొరేషన్‌కు మహర్దశ – మేయర్

కడప నగరపాలక సంస్థకు మహర్దశ పట్టనుందని, నిధులు వెల్లువలా రానున్నాయని మేయర్ సురేష్ బాబు అన్నారు. కడప నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు టీడీపీ ప్రభుత్వంలో తాము చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయన్నారు. మొదట గండికోట జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురావాలనుకున్నా కలెక్టర్, ఈఎన్‌సీలు బ్రహ్మంసాగర్ నుంచైతే బాగుంటుందని సూచించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే అలగనూరు నుంచి 0–18 కి.మీ కెనాల్ పనులు పూర్తి చేసి బ్రహ్మంసాగర్‌లో 16 టీఎంసీల నిల్వ ఉంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రస్తుతం బ్రహ్మంసాగర్‌లో కడపకు 1.50 టీఎంసీల నికర జలాలను కేటాయిస్తూ ముఖ్యమంత్రి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. బ్రహ్మం సాగర్ నుంచి 10 కి.మీ మేర పంపింగ్ చేస్తే, మిగతా మొత్తం గ్రావిటీ ద్వారా కడపకు నీరు వస్తుందని తెలిపారు. దేశ చరిత్రలో ఏ మున్సిపల్ కార్పొరేషన్‌లో లేనివిధంగా కడపకు సోలార్‌ప్లాంటు రానుందని, ఇందుకు 85 ఎకరాలు కేటాయించామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



తేజ పెట్రోల్ బంక్‌లో డీజిల్, పెట్రోల్ తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కడప అర్బన్ : కడపలో రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ పి. రామకృష్ణ, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ. బాలగంగాధర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు కె.వి కిషోర్, వి. అశోక్ కుమార్, జిల్లా సివిల్ సప్‌లైస్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ఆఫీసర్ తారకనాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ సిబ్బందితో కలిసి కడప నగరంలోని తేజ ఫిల్లింగ్ సెంటర్, వాసవి ఫిల్లింగ్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

■ ఈ తనిఖీలలో పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ డెన్సిటీని, క్వాలిటీ అండ్ క్వాంటిటీలను డిస్పెన్సింగ్ యూనిట్లను వాటికి సంబంధించిన పెట్రోల్ బంకుల్లో ఇస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.

■ ఈ తనిఖీలలో భాగంగా ఎక్స్‌ప్లోసివ్ మెటీరియల్ క్యారీ చేయడానికి అవసరమైన అనుమతి పత్రాలు సరిగా లేనందున వాసవి ఫిల్లింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఏపీ 04 యుఏ 1623 డీజిల్, పెట్రోల్ రవాణా చేసే ట్యాంకర్‌ను సీజ్ చేశారు. ట్యాంకర్ యజమాని పొలాది ఉమామహేష్, బాలాజీ భరత్‌కుమార్ పైన సెక్షన్ 6(ఏ) ఈఎస్ యాక్ట్ 1955 చట్టం మేరకు కేసు నమోదు చేశారు.

■ ఈ సందర్భంగా కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా మాట్లాడుతూ పెట్రోల్ బంకు యజమానులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నుంచి తగిన లైసెన్సులు కచ్చితంగా పొంది ఉండాలన్నారు. అలాగే నాణ్యమైన, స్వచ్ఛమైన కల్తీలేని పెట్రోల్, డీజిల్‌లను వాహనదారులకు అందించాలన్నారు.

విద్యాబోధనపై అవగాహన లేకపోతే ఎలా?

ఉపాధ్యాయుల తీరుపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మండిపాటు

పోరుమామిళ్ల : విద్యార్థులకు ఎలా విద్యాబోధన చేయాలన్న దానిపై ఉపాధ్యాయులకు ఇప్పటికీ అవగాహన లేకపోతే ఎలా? విద్యార్థులను నిలబెట్టి చదువు చెబుతారా? బ్లాక్ బోర్డు బదులు రైటింగ్ ప్యాడ్ అట్టను ఎలా ఉపయోగిస్తారని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరావు పనితీరు కారణంగా ఆయన జిల్లా విద్యాశాఖ అధికారులకు తలంటారు. వ్యవస్థలో మార్పు రాదా? ఇంత అలసత్వమా? అంటూ మండి పడ్డారు. డిజిటల్ బోర్డులను ఉపయోగించుకొని పిల్లలకు చక్కగా పాఠాలు చెప్పాలన్నారు. పిల్లలకు యూనిఫామ్ లేకపోవడంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు–నేడు పనుల్లో జాప్యంపై ఆయన సచివాలయ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిశీలన..

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు–నేడు పనులు, వాటర్ ప్లాంట్ పరిశీలించారు. శుద్ధి నీటిని పరీక్షించి ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని, ఈ నీళ్లు తాగితే పిల్లలకు రోగాలు వస్తాయని, ముందు ప్లాంట్ బాగు చేయాలన్నారు. నాడు–నేడు పనుల గురించి ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.



పోరుమామిళ్ల : టేకూరుపేటలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

అనంతరం టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. అక్కడ కూడా హెడ్మాష్టర్ రత్నస్వామి పనితీరుపై మండిపడ్డారు. లోపాలు సరిదిద్దుకోక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయన వెంట పాఠశాలల ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి, కళాశాలల ఆర్జేడీ రవి, డీఈఓ రాఘవరెడ్డి, ఎస్‌ఎస్‌ఏ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐఓ రమణ రాజు, ఆర్‌డీఓ ఆకుల వెంకటరమణ, తహసీల్దారు గంగయ్య, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు నిధులను సద్వినియోగం చేసుకోండి

కలసపాడు : ప్రభుత్వం పాఠశాలలకు నాడు–నేడు కింద మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలసపాడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని తరగతి గదులను, నాడు–నేడు ఫేజ్–2 కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన తీరు గురించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి ఆ విద్యార్థితో ఇంగ్లీషులో మాట్లాడగా విద్యార్థిని చక్కగా మాట్లాడటంతో తరగతి ఉపాధ్యాయురాలైన రబ్బానితో ఫోన్‌లో మాట్లాడి ఆమెను అభినందించారు. ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి

కాశినాయన : విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సకాలంలో వారికి అందించి విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక అందిందా అని ఆరా తీశారు. పుస్తకాలు, బ్యాగులు పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవడం మీకు తెలియదా అని హెచ్ఎంను మందలించారు. ఎంఈఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన దహనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం వలసపల్లె రోడ్డులోని షాదీఖానా సమీపంలో నివాసం ఉండే ఇల్లూరు దహనాథ్‌రెడ్డి (56) అనే వ్యక్తి అప్పులకు పూచీకత్తు పడి వాటిని కట్టించలేక శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రగుంట్ల ఎస్ఐ క్రిష్ణంరాజు నాయక్ కథనం మేరకు.. దహనాథ్‌రెడ్డి స్థానిక ఐసీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేసేవాడు. తోటి కార్మికులకు అప్పులు ఇప్పించి పూచీకత్తు పడ్డాడు. అయితే అప్పులు తీసుకున్న వారు తిరిగి చెల్లించకపోవడం.. అడిగితే వారు పలకకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై వలసపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద ఉన్న పాడుబడ్డ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కూడా కరోనా సమయంలో మృతి చెందింది. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఉప సర్పంచ్‌కు గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై కారు ఢీకొన్న సంఘటనలో కొండూరు ఉప సర్పంచ్ బోవిళ్ల రామకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో రామకృష్ణారెడ్డి బద్వేలు వెళ్లేందుకు బస్సుకోసం పోలీస్ స్టేషన్ సమీపంలో నిలుచుని ఉన్నాడు. బద్వేలు వైపు నుంచి వేగంగా వస్తున్న ఏపీ 27బీఎస్8282 నెంబరు గల కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కారు డ్రైవర్ కారును ఆపినట్లే ఆపి వేగంగా ఉడాయించాడు. వెంటనే స్థానికులు ఎస్ఐ కేసీ రాజుకు సమాచారం అందించడంతో ఆయన వెంబడించి సిద్దవటం సమీపంలో కారుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం కడపకు తరలించారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న జిల్లా జడ్జి



రామయ్య సన్నిధిలో కుటుంబ సమేతంగా ఉన్న జిల్లా న్యాయమూర్తి అన్నపూర్ణమ్మ

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను శనివారం కడప జిల్లా కోర్టు న్యాయమూర్తి అన్నపూర్ణమ్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూల మూర్తులైన సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, సిద్దవటం కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్ ఉన్నారు.

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామిని శనివారం జిల్లా జడ్జి అన్నపూర్ణమ్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈమె వెంట నందలూరు జడ్జి లత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు, ఏజీపీ షమీవుల్లాఖాన్ ఉన్నారు.

రూ.760కోట్ల అభివృద్ధి పనులకు సీఎంతో శంకుస్థాపన

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7,8 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తెలిపారు. ఈ క్రమంలో కడప నగరపాలక సంస్థలో రూ.760కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నగరపాలక అత్యవసర సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రూ.572కోట్లతో అమృత్ పథకం కింద కడప నగరానికి బ్రహ్మం సాగర్ నుంచి 1.50 టీఎంసీల తాగునీరు అందించే పథకానికి శంకుస్థాపన చేయనున్నారన్నారు. రూ.20కోట్లతో బుగ్గవంకపై రెండు నూతన బ్రిడ్జిల నిర్మాణానికి, పాత మున్సిపాలిటీ వద్ద రూ.32కోట్లతో నిర్మించనున్న నూతన నగరపాలక సంస్థ కార్యాలయానికి భూమిపూజ చేయనున్నారని తెలిపారు. రూ.69కోట్లతో జగనన్న కాలనీలు, వైఎస్సార్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. రూ.12కోట్లతో ఆధునీకరణ చేసిన రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కులను ప్రారంభించనున్నారన్నారు. రిమ్స్ ప్రాంగణంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రసాద్ ఐ హాస్పిటల్, మానసిక వైద్యశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డిసెంబర్‌లో ఈ భవనాలను ప్రారంభిస్తామని చెప్పారు. రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేస్తామని, మూడు రోడ్లను డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం



6 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ ముఖేష్



5 వికెట్లు తీసిన అనంత బౌలర్ తన్వీర్



54 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ సుతేజ్‌రెడ్డి



42 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ విజయ్ రామ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం నిర్వహించిన మ్యాచ్‌ల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 41.2 ఓవర్లలో 155 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భవానీప్రసాద్ 37, రెడ్డిరుషీల్ 37 పరుగులు చేశారు. అనంత బౌలర్లు తన్వీర్ జమీల్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 28.1 ఓవర్లలోనే 87 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని వీరారెడ్డి 25 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ ముఖేష్ 6 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 68 పరుగుల తేడాతో విజయం సాధించింది.

నెల్లూరు జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 30.2 ఓవర్లలో 120 పరుగుల వద్ద కడప జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని సి. విజయ్ రామ్‌రెడ్డి 66 బంతుల్లో 5 ఫోర్లతో 42 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సుజిత్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో నెల్లూరు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

నడిరోడ్డుపై కత్తులతో యువకుల ఘర్షణ





సంఘటన స్థలంలో నిందితులను అదుపులోకి తీసుకుంటున్న కడప ఒన్‌టౌన్ పోలీసులు

- ముగ్గురికి తీవ్రగాయాలు
- పోలీసుల అదుపులో నిందితులు

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాలెంపాపయ్య వీధిలో శనివారం రాత్రి కొందరు యువకులు కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పాతకక్షలో.. మద్యం మత్తులోనో వీరు తీవ్ర స్థాయిలో ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటన జరిగిన వెంటనే కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ జి. మధుసూదన్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని రిమ్స్‌కు తరలించారు. కడప ఒన్‌టౌన్ పోలీసులతో పాటు, రక్షక్, బ్లూకోల్ట్స్ పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆ ప్రాంతంలో గస్తీ తిరిగారు.

భూ వివాదంలో పూజారిపై దాడి

గాలివీడు: మండలంలోని గోపనపల్లె గ్రామం బండమీద నక్కలవాండ్లపల్లె సమీపంలోని నాగదేవత ఆలయం వద్ద పూజారి కృష్ణారెడ్డిపై ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. నక్కలవాండ్లపల్లె సమీపంలో పురాతనమైన నాగదేవత ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని దాదాపు 20 సంవత్సరాల క్రితం పూజారి కృష్ణారెడ్డి తన సొంత నిధులతో గోపనపల్లె సర్వే నెంబరు 194/1ఏలో య0.34 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించారు. రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యర్థి అయిన ఎమ్. పెద్ద ఇరగంరెడ్డి, కుటుంబ సభ్యులు పూజారి కృష్ణారెడ్డిపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే బాధితుడు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని మండల పోలీసులు తెలిపారు.